REG. NO. M. 1714.

అష్టమసంపుటము చతుర్థసంచిక.

# గ్రంథాలయ సర్వస్వము.

ఆంధ్రదేశ గ్రంథాలయ సంఘము పక్షమున

ప్రకటింపబడు మాసపత్రిక

సంపాదకుడు.

అయ్యంకి వేంకటరమణయ్య.

## విషయ సూచిక

సప్తమ తూర్పుగోదావరి మండల
ధర్మగ్రంథాలయ మహాసభ ౪౯
బర్మాదేశ గ్రంథాలయోద్యమము ౫౭
దక్షిణాంధ్ర క్షత్రియ గ్రంథాలయము ౬౦
ప్రకాశం గ్రంథాలయం శ్రీవేంద్రం ౬౧
శ్రీ లక్ష్మీనరసింహ ఆంధ్ర గీర్వాణ పుస్తక భాండాగారము - ఉచిత పఠనాలయము ౬౧
రామమోహన ధర్మగ్రంథాలయము - బెజవాడ ౬౨
నివేదికలు ౬౩

బెజవాడ: ఆంధ్ర గ్రంథాలయ ముద్రాక్షరశాలయందు
కె. కోదండరామయ్యగారిచే ముద్రింపబడి ప్రకటింపబడినది.

వార్షికమూల్యము రు ౧-౮-౦] [విడిసంచిక వెల రు ౦-౨-౦

CD

RSVM01 ... 144

1

# గ్రంథాలయసర్వస్వము.

| సంపు ౮. | బెజవాడ - అక్టోబరు ౧౯౨౯. | సంచిక ౪. |
|---|---|---|

## సప్తమ తూర్పు గోదావరి మండల ధర్మగ్రంథాలయ మహాసభ.

25–10–29 తేదీ మధ్యాహ్నము 2 గంటలకు ఈసభ సామర్లకోటయందు మహావైభవముగ జరిగినది. మండలమందున్న వివిధ గ్రంథాలయములనుండి ప్రతినిధులేతెంచిరి. ప్రార్థన గావింపబడిన పిమ్మట ఆహ్వానసంఘాధ్యక్షులగు డాక్టరు చాగంటి సన్యాసిరాజు యల్. యం. పి. గారు ప్రతినిధుల నాహ్వానించిరి.

### ఆహ్వాన సంఘాధ్యక్షుని యుపన్యాసము.

### స్థలచరిత్ర.

తామిప్పుడీ సమావేశమైన సామర్లకోటగ్రామము ప్రసిద్ధస్థలమును పుణ్యక్షేత్రమునై యున్నది. పూర్వమందు శ్యామలాంబాదేవీ సంరక్షితంబగు కోట యుండుటచే శ్యామలకోట యనుపేరు వచ్చినది. అదియే క్రమముగా సామర్లకోటగా మారినది.

శ్వేతాధికారుల శరీరముల మంట లెక్కించిన మహావీరవనితయు బతివ్రతాశిరోమణియునగు కామమ్మ పాట నాలింపని స్త్రీ పురుషు లాంధ్రులలో లేరుగదా. అట్టి సాధ్వీమతల్లి ఆర్యాచారపరాయణ చూపరులెల్ల నివ్వెరపాటొంద భర్తతో సహగమన మొనర్చిన పావనక్షేత్ర మిదియే ?

మహాశివక్షేత్రములలో సుప్రసిద్ధమగు శ్రీ భీమేశ్వరాలయ మిచ్చటనే యున్నది. యీ దేవాలయము దేవతానిర్మాణమను ప్రతీతియు గలదు. ఇచ్చటి లింగ మత్యున్నతము. మహాశివరాత్రికి వేనవేలు భక్తులు వచ్చి భీమగుండ మను కొలనులో స్నానముచేసి

స్వామిని దర్శించి ఐహికాముష్మిక ఫలితములను బొందుచుందురు. ఈ దేవాలయోత్సవములకు శ్రీ పీఠికాపుర మహారాజావా రొసంగిన భూము లున్నవి. పెద్దాపురపురాజుల పరిపాలనలో గూడ గొప్పకోట యుండెడిది. బొబ్బిలియుద్ధములో రంగరావుకుమారుని రహస్యముగా మల్లమ్మదేవి పంపయత్నించిన దీ కోటకే. మొన్న మొన్నటి వరకు బ్రిటిషుపటాలము లిచ్చటనే యుండెడివి. గోదావరికాలువయును, యేలామహామునిచే దీసికొని రాబడిన యేలేరును యిచ్చటనే బ్రవహించుచున్నవి. మన మండలములో పంచదారచేయు ఫ్యాక్టరీయును, వ్యవసాయపరిశోధకశాలయును నిచ్చటనే యున్నవి.

## గ్రంథాలయోద్దేశ్యము.

దీనిని బ్రతిగ్రామమునను స్థాపించి తన్మూలమున బ్రజలను జ్ఞానవంతులనుగా నొనర్చు సంకల్పమే గ్రంథాలయోద్యమము. జనుల నెల్లర జ్ఞానవంతులుగా నొనర్చుటయే దీని లక్ష్యము. తాను జ్ఞానవంతుడై పరులను జ్ఞానవంతుల జేయవలెనను స్వభావమే యీ యుద్యమ కారణము. మనుజుని జీవయాత్ర పవిత్రముగను బురుషార్థ సాధకముగను జేయుటయే ఈ యుద్యమ ప్రాప్యము.

## పూర్వచరిత్ర - పరిణామము.

చిరకాలము క్రిందట నార్యఋషులే గ్రంథాలయములుగా నుండిరి. అప్పుడు భాషకు లిపిలేనందున దండ్రులు పుత్రులకును, గురువులు శిష్యులకును సంతలజెప్పి వల్లింపజేయుచు సుమారారువేల సంవత్సరముల కాలము విజ్ఞానమును గాపాడిరి. లిపి యేర్పడినపిదప దాళపత్రములు, శిలలు, రేకులు, కొయ్యలు, మొదలగువానిపై వ్రాయుచుండిరి. పదునేనువందలసంవత్సరములనాటి తాళపత్రి గ్రంథములందు ఒక్కొక పత్రముపై పదునారుపంక్తులు గలిగి ముత్యములు బోలు నక్కరముల గాంచినయెడల మనపూర్వుల గ్రంథాభిమానమును వారుపడిన శ్రమయు దెలియగలదు. మనదేశమునందు గ్రంథాభిమానము నవీనముకాదు. పాశ్చాత్యులు వస్త్రధారణ మననేమో యెరుగనికాలమునగూడ మనదేశము విజ్ఞానామృతమును పెద

జల్లుచుండెడిది. ఆర్యస్వతంత్రప్రభువుల కాలమున రాజనగరులందును, దేవాలయములందును గ్రంథాలయము లుండెడివి. అలెగ్జాండరు దండయాత్రలో కొన్నిగ్రంథములను గ్రీకులు గొనిపోయిరి. అశోకుని కాలమునుండి బౌద్ధులును, జైనులును, గ్రంథాలయస్థాపన చేయసాగిరి. ఆకాలముననే విశ్వవిద్యాలయము లేర్పడి వాని కనుబంధములుగా గ్రంథాలయము లేర్పడినవి. వేదకాలమునుండి నేటివరకును కాశీపురము విద్యాస్థానమై యున్నది. క్రీస్తుశకము ఆరవశతాబ్దమున తక్షశిలా విశ్వవిద్యాలయము మహాఖ్యాతి నందెను. దానియందు పదియారువిద్యలు బోధింపబడుచుండెను. అమరావతీ కళాశాలకు చీనా, బర్మా, సింహళాది దేశములనుండి విద్యార్థులు వచ్చుచుండిరి. దూపాంగ విశ్వవిద్యాలయము బౌద్ధులకు మిగుల లాభకారిగా నుండెడిది. ప్రాచీన విశ్వవిద్యాలయములలో నలందా విశ్వవిద్యాలయము మహోన్నతస్థానము నాక్రమించెను. ఆశియాఖండమందన్ని ప్రాంతములనుండియు విద్యార్థు లిటకు వచ్చుచుండిరి. దీని కనుబంధముగా "రత్నోదధి" యను పుస్తకాగార మెనిమిదియంతస్థుల మేడపై నెలకొల్పబడెను.

బౌద్ధమతక్షీణతతో నివియు క్షీణింపసాగెను. చీనాయాత్రికుడగు హియూనిత్సాంగు 657 గ్రంథములను చీనాకు గొనిపోయెను. కొన్ని బౌద్ధగ్రంథములను హిందూమతోద్ధారకులు నశింపుజేసిరి. తరువాత పదునొకండు మొదలు పదునేడవ శతాబ్దమువరకును మహమ్మదీయుల దండయాత్రలవలన గ్రంథాలయములు పూర్తిగా నాశనమయ్యెను. "ఉదంతపుర, విక్రమశిల" విశ్వవిద్యాలయములు మహమ్మదీయుల క్రోధాగ్ని కాహుతులయ్యెను. మొగలాయిరాజ్యవినాశనముతో దేశమరాజకమయ్యెను. పాశ్చాత్యులనేకులాకాలమున వచ్చి మనగ్రంథసముదాయమంతయు గొనిపోయిరి. ఆగ్రంథములు, లండను, ప్యారిసు, బర్లిను లైబ్రరీలలో నిప్పుడుగూడ జూడగలము. స్వామి దయానందసరస్వతిగారు అధర్వణవేదమును జర్మనునుండియే గొనితెచ్చిరి. టిప్పు సుల్తాను గ్రంథాలయమునందున్న 20,000 వ్రాతప్రతులు బ్రిటిషువారు గొనిపోయిరి. 1856 సంవత్సరములో

అయోధ్యరాజుయొక్క గ్రంథాలయగ్రంథములు సైనికుల వంట కట్టెలుగా నుపయోగింపబడెను. చీనాయాత్రికుడగు పాహియాను సంస్కృతమును, మతగ్రంథములను పాటలీపుత్రమున మూడేండ్లుండి నేర్చుకొనెను. గుప్తరాజులకాలములో దేవాలయము లన్నిటియందును గ్రంథాలయము లుండెడివి. నలంద విశ్వవిద్యాలయ క్షీణకాలమునందే మగధరాజులచే "ఉదంతపురి, విక్రమశిల" విశ్వవిద్యాలయములేర్పడి గ్రంథాలయము లేర్పడెను. విక్రమశిల గ్రంథాగారమునందలి గ్రంథములలో బెక్కింటిని టిబెట్టువారు గొనిపోయిరి. 1202 సం॥ రం లో భక్తియారుఖిల్జి బేహారును జయించినప్పుడు ఉదంతపురి గ్రంథాలయ మాతని సేనానియగు మహమ్మదుబిన్‌సివిచే దగులబెట్టబడెను. ఉత్తరహిందూస్థానమందున్న విహారములలో ననేకములు మహమ్మదీయులచే నశింపుకాబడినవి. సన్యాసులు కొన్ని గ్రంథములు "నేపాలు" నకు గొనిపోయిరి. నేపాలునుండి బ్రిటిషు మంత్రులు నయభయములచే కొన్నిగ్రంథముల గైకొని బ్రిటనులో జేర్చిరి. ఆదేశమంత్రి 1909 సం॥ రం లో ఆక్సుఫోర్డు గ్రంథాలయమునకు 6,330 గ్రంథరాజముల నిచ్చి మనదేశమును గ్రంథహీనముగా జేసెను.

ఇట్లు మనదేశము పరరాజాక్రమణచే హీనదశకు వచ్చి మన గ్రంథరాజములు క్షీణించినను బొత్తిగా గ్రంథాలయములు లేవని దలంపరాదు. తురకప్రభువులలోగూడ గ్రంథాలయముల గాపాడినవారనేకు లున్నారు. "ఫిరోజిషా" పండితులచే ననేకగ్రంథములను వ్రాయించెను. "అక్బరుచక్రవర్తి" మత, సాంఘిక, రాజకీయ, ప్రకృతిశాస్త్ర గ్రంథముల ననేకములను సేకరించి గ్రంథాలయోద్యమమునకు వన్నెదెచ్చెను. పదియవ శతాబ్దమున రాజరాజనరేంద్రుడును,పదునేనవశతాబ్దమున శ్రీకృష్ణదేవరాయలును అనేక గ్రంథరాజములను వ్రాయించిరి. పతాను, అహమ్మదాబాదు, నద్యాను, సూరతు, కాంబే, తరాదు, జబల్ మీరు, భట్నీరుగ్రంథాగారములందు 10,000 వ్రాతప్రతుల వంతున నున్నవి. నేపాలులో, పతానుపురిలో 40 పెట్టెలవ్రాతపతు లున్నవి. జసలీమీరునందున్న వరశునాథభాండా

5



గారములో వేలకొలది వ్రాతప్రతులున్నవి. కనరాజిల్లా ముదచిద్రి లో గొప్ప జైనుగ్రంథాలయ మున్నది. మన ప్రభుత్వమువారి పరిశీలనవలన ఆల్వారు, బికనీరు, తంజావూరు, జమ్ము, నేపాలు, మైసూరు, జోధపురము గ్రంథాలయములు వెలసినవి.

ఇ త ర దే శ ము లు

అమెరికా, గ్రంథాలయోద్యమమునం దగ్రస్థానము వహించి యున్నది. ఇంగ్లండులో కల్లంగడులలో గూడ లైబ్రరీలు గలవట. ఫ్రాన్సు మొదలగు దేశములలో గ్రంథాలయములేని పల్లెలేదు. ఆదేశము లన్నివిధములను మహోన్నతదశ నొందుటకు గ్రంథాలయములే కారణము.

ప్ర స్తు త స్థి తి.

ప్రస్తుతము మనదేశస్థులు స్వరాజ్యాపేక్షాపరులై యున్నారు. దేశీయమహాసభ తత్ఫలితమునకే బ్రయత్నించుచున్నది. గాంధి మహాత్ముడు దీనిని నడుపుచున్నాడు. స్వరాజ్యసంపాదనకును, వచ్చిన పిదప దానిని నిర్వహించుకొనుటకును గ్రామనిర్మాణ మావశ్యక మని ప్రాజ్ఞులెల్ల రంగీకరించుచున్నారు. గ్రామపునర్నిర్మాణమునకు విద్య పునాది. మనదేశములో నూటికి పదిమందిగూడ అక్షరాస్యులు లేరు. జనులకు విద్యలేనిది స్వరాజ్యములేదు. వచ్చినను నిర్వహింపజాలము. మనకు జాలినన్ని పాఠశాలలులేవు. వానిలో నేర్పువిద్యగూడ గవర్నమెంటు గుమాస్తాపనుల కక్కరకు వచ్చునదేగాని మనకు లాభకారిగా లేదు. మనము పేదలమగుటచే చిరకాల విద్యాభ్యాస మొనర్పలేము. ప్రతిగ్రామమందును గ్రంథాలయ మున్నయెడల నాకొరత దీరిపోవును. అమెరికాగ్రంథాలయోద్యమనాయకులగు "డాక్టరు మెల్విడేవి" బాలురకు పాఠశాలలు, పెద్దలకు గ్రంథాలయములు అని చెప్పియున్నారు.

ము గిం పు.

మన మిప్పుడు చేయవలసినపని చాలయున్నది. గ్రంథాలయములు శైశవావస్థలోయున్నవి. మనమండలములో మణిపూస యన

దగు గౌతమీగ్రంథాలయముగూడ కలహాభూయిష్టమగుట విచారకరము. సంఘసంస్కర్తలలో వన్నెకెక్కిన శ్రీకందుకూరు వీరేశలింగం పంతులువారి గ్రంథాలయమును, శ్రీ చెలికాని లచ్చారావుగారిచే స్థాపింపబడిన ఆంధ్రపరిశోధక మహామండలి గ్రంథాలయమును, కాకినాడలో శ్రీ పోలవరం జమీందారువారి గ్రంథాలయమును వృద్ధి నొందుచుండుట సంతోషదాయకము. మహాత్మాజీ బోధ ననుసరించి యనేకగ్రంథాలయములు బయలుదేరుచుండుట సంతోషకరము. ప్రస్తుతమున ప్రభుత్వమువా రీ యుద్యమమునకు సానుభూతి జూపుచున్నారుగాని వారిసహాయ మత్యల్పము. నిర్బంధము లనేకములగుటచే జాల గ్రంథాలయము లాకొద్దిలాభముగూడ బడయజాలకున్నవి. మన స్వశక్తివలన వీని యభివృద్ధినే జేయజాలని యెడల స్వరాజ్య మెట్లు సంపాదించగలము? కాన ప్రతిగ్రామమందును గ్రంథాలయ మేర్పరచి విద్యాభివృద్ధిచేయుడు. వీనికి అనుబంధముగా రాత్రిపాఠశాలల నేర్పరచి, విద్యాహీనులగు వారలకు విద్యాదాన మొనర్పుడు. పత్రికలం దెప్పించి దేశవార్తలను నాయకులమహోపన్యాసములను వినిపింపుడు. గ్రంథాగారములతో రాట్నములనుంచి ఖద్దరును ప్రోత్సహింపుడు. గ్రామ పునర్నిర్మాణాధారమగు గ్రంథాలయాభివృద్ధికి గడంగుడు. శ్రీదరిద్రనారాయణమంత్రరాజమును స్మరింపుడు.

## అధ్యక్షులు.

అనంతరము శ్రీ వరసింహదేవర సత్యనారాయణగారు అధ్యక్షత వహించి గంభీరోపన్యాస మొనంగిరి. వారి యుపన్యాసము ముందు సంచికయందు ప్రకటింపబడును. వారి యుపన్యాసమైనపిమ్మట శ్రీ కాట్రావులపల్లి సూర్యనారాయణ యోగినిగారు గ్రామ్యపుస్తకపఠనమునుగూర్చి చెప్పిరి. అనంతరము ఈక్రింది తీర్మానములు చేయబడినవి.

## తీర్మానములు.

(1) ఆంధ్రదేశములో 1898 సంవత్సరమున ప్రథమ గ్రంథాలయముగా ప్రారంభింపబడి, గ్రంథాలయోద్యమునకు మార్గదర్శక

ముగా కృషి సల్పుచున్న రాజమహేంద్రవర గౌతమీగ్రంథాలయమునకు రజతోత్సవము జరుపుటకు ఈసభవారు తీర్మానించుచున్నారు.

ఈ యుత్సవమును జరుపుటకు గౌతమీ గ్రంథాలయ సభ్యులను, మండలస్థాయి సంఘసభ్యులను, ఆంధ్రదేశ గ్రంథాలయ సంఘ సభ్యులను పూనవలసినదిగా ఈ సభవారు హెచ్చరించుచున్నారు.

(2) గుంటూరు బెజవాడ మునిసిపాలిటీవారును, తాడేపల్లిగూడెం తాలూకాబోర్డు వారును, ధర్మగ్రంథాలయములను స్థాపించి విజ్ఞానప్రచారమునకు తోడ్పడుచున్నందులకు వారి నభినందించుచు ఇతర మునిసిపాలిటీలును లోకలుబోర్డులును వారిఆదర్శము గైకొని గ్రంథాలయోద్యమమును ప్రోత్సహించవలెనని ఈసభవారు కోరుచున్నారు.

(3) "రేడియో" యంత్ర సహాయమున ఆంధ్రోపన్యాసములు యిప్పించుట మూలమునను, మాజిక్ లాంతరు సినీమాప్రదర్శనముల వలననుజన సామాన్యమునందు విజ్ఞానము వ్యాపింపజేయుటకు స్థానిక సంస్థలను, గ్రంథాలయోద్యమాభిమానులను ఈసభవారు హెచ్చరించు చున్నారు.

(4) లోకలుబోర్డుల ద్వారాను, రాష్ట్రీయ సహకార యూనియనుల ద్వారాను నిర్వహింపబడుచున్న గ్రామ పునర్నిర్మాణ కేంద్ర స్థానములలో కేంద్రగ్రంథాలయములను స్థాపించి, ఆయాప్రాంతములందలి గ్రామ జనులకు సంచార గ్రంథ పేటికల మూలమున గ్రంథపఠన వ్యాప్తికి తోడ్పడవలెనని ఆయా సంస్థలవారిని కోరడమైనది.

(5) సహకార స్థానిక యూనియనుల కార్యస్థానములందు కేంద్ర గ్రంథాలయములను నిర్వహించి, స్థానిక యూనియను ప్రదేశములలోని సహకారసంఘముల సాముదాయ ప్రయోజన నిధితో గ్రంథాలయ సంచార ప్రచారకులను పోషించి ఉద్యమవ్యాప్తికి తోడ్పడవలెనని ఈసభవారు సహకార యూనియనులను హెచ్చరించు చున్నారు.

(6) జిల్లాలోని సెంట్రల్ కోఆపరేటివ్ బ్యాంకులు వారి సాముదాయ ప్రయోజన నిధినుండి వారి కార్యాలయమున కేంద్ర

గ్రంథాలయములను స్థాపించి, తద్వారా స్థానిక యూనియనుల గ్రంథాలయములకు గ్రామ సహకార సంఘములకు సంచార గ్రంథాలయ పేటికల మూలమున గ్రంథపఠనవ్యాప్తిని జేయుదురని ఈసభ వారు హెచ్చరించు చున్నారు.

(7) పంచాయితీల ఆక్టుక్రింద నిర్వహింపబడు గ్రామ పంచాయితుల యాజమాన్యమున నిర్వహింపబడు గ్రంథాలయములకు మూడు వందల రూపాయలతో స్వస్తి చెప్పక, గ్రామ పంచాయితీ గ్రంథాలయాభివృద్ధికి పంచాయతు లిచ్చెడు విరాళమునకు సరిసమానమగు విరాళమును ప్రభుత్వమువారును స్థానికసంస్థలును యిచ్చి ప్రోత్సహించవలెనని ఈ సభవారు కోరుచున్నారు.

(8) కీర్తిశేషులైనకందుకూరి వీరేశలింగంపంతులుగారిచే స్వదస్తూరిని వ్రాయబడిన పుస్తకములు అఖిలాంధ్రదేశముయొక్క సొత్తు కావున వానిని భద్రపరచుటకు రాజమండ్రి హితకారిణీ సమాజము వారిని ఈసభవారు హెచ్చరించు చున్నారు.

(9) ఆంధ్రదేశమందలి సుప్రసిద్ధజాతీయ వారపత్రిక "కాంగ్రెసు" సంపాదకులగు శ్రీ మద్దూరి అన్నపూర్ణయ్యగారిని చారిత్రిక నాటకమును ప్రచురించినందులకై ప్రభుత్వమువారు శిక్షించియు, "కాంగ్రెసు" స్వాతంత్ర్య, విప్లవసంచికలు బహిష్కరించియు, నిజమగు చరిత్రరచన ప్రచారములను నిరోధమొనర్చినందుల కీసభవారు ప్రభుత్వపు నిరంకుశచర్యను నిరసించుచున్నారు.

ఇట్టి సత్యచరిత్రల ప్రచురించి ప్రభుత్వపు నిర్బంధాగ్నికి గురియై శిక్ష ననుభవించుచున్న శ్రీ మద్దూరి అన్నపూర్ణయ్యగారి త్యాగధైర్యముల నీసభవా రభినందించుచున్నారు.

(10, మండలమందున్న అన్ని గ్రంథాలయములలోను హిందీ భాషాభివృద్ధికి తోడ్పడునటులను, హిందీగ్రంథములనుగూడ నుంచునటులను ఆయాగ్రంథాలయాధికారులను ఈసభవారు హెచ్చరించు చున్నారు.

(11) ఈ సభాతీర్మానములను అమలులో పెట్టుటకును, ధర్మ గ్రంథాలయోద్యమమును ఈమండలములో వ్యాప్తిచేయుటకును ఈక్రిందివారిని స్థాయిసంఘముగా యేర్పాటు చేయడమైనది.

అధ్యక్షులు :—నరసింహ దేవర సత్యనారాయణగారు

ఉపాధ్యక్షులు :—డాక్టరు సన్యాసిరాజుగారు
యాతగిరి లక్ష్మీవేంకటరమణగారు
మారిన నరసన్నగారు
మల్లిపూడి పళ్లమరాజుగారు

కార్యదర్శులు :—అవసరాల రామచంద్రరావుగారు
కంభంపాటి లక్ష్మీనరసింహసోమయాజులు గారు

12 రాబోవు సంవత్సరము ఈసభను ప్రత్యేకముగా ఆలమూరునందు చేయుటకు శ్రీ నరసింహదేవర సత్యనారాయణగారిచే ఆహ్వానింపబడినది.

---

## బర్మాదేశ గ్రంథాలయోద్యమము.

గ్రంథాలయోద్యమము ఆంధ్రసీమలందు విరివిగా మొలకలెత్తుచు సర్వజనాదరణమును బొందుటయేగాక యిరుగుపొరుగు రాష్ట్రీయసోదరుల మానససీమలందునుగూడ నాకర్షింపబడి నీ యుద్యమమును దమదమ మండలములందును వెదజల్లవలయునని యుత్సాహము వారి నాయకశిఖామణులకు జనించి, దానికి దగినకృషి సల్పుచున్నారు. అయితే పొరుగుననుండు నీబర్మాదేశమున గ్రంథాలయోద్యమమునందు పూనికవహించియుండునటుల కాన్పింపదు. ఎందుకన భారతీయులవలె బర్మీయులందు ప్రోత్సాహము లేకపోవుట యటుండ ఈయుద్యమమునకు ప్రజాప్రతినిధుల మనోదృష్టియందైన స్థానమేర్పడియుండలేదు. విద్యావంతులకన్ననో ఉద్యమతత్వ మింకను సువ్యక్తముగా బోధపడలేదు, రంగూను విశ్వవిద్యాలయము కార్యరూపము

దాల్చిననాటినుండి విద్యావంతులకు కొరతలేదుగాని దేశప్రముఖులు రాజకీయమున పాల్గొని బర్మాప్రత్యేక రాష్ట్రవిభజనకై యాందోళన మారంభించియున్నారు. విద్యాధికులన్ననో స్వధర్మమును పూర్ణముగా త్యజించి పరధర్మవ్యామోహమున చిక్కి సినీమాప్రదర్శనా పరిశ్రమమునందు పాటుపడుచున్నారు. నాగరికత హెచ్చగుకొలది బాల బాలిక విద్యాలయసంస్థలు యభివృద్ధియగుచున్నవే గాని తరిగిపోవుట లేదు. విద్యాభివృద్ధి యధికమగుచుండెడు నీకాలమున నవలలు- నాటకములు- చిత్రవిచిత్ర మాసపత్రికలు నెక్కువగా బయలుదేరుచున్నవి. దేశభాషయగు "బర్మా"ను నిర్బంధపాఠముగా నొనర్పవలయునని దేశీయవిద్యావిచారణసంఘమువారు రంగూను విశ్వవిద్యాలయమును నిర్బంధమొనర్చుచున్నారు. బర్మావాఙ్మయమున నవలలు- నాటకాది భాషాంతరీకరణములేగాక విజ్ఞానశాస్త్రీయగ్రంథములును, వాణిజ్యాది పరిశ్రామిక విషయములగూర్చి నింక నెన్నియో గ్రంథములు రచించుటకు దేశీయపత్రికాసంపాదకులు తీవ్రప్రయత్నములొనర్చుచున్నారు. బర్మా సారస్వతము కృష్ణపక్షమున నున్నదనుటకు వీలులేదు. గ్రంథాలయమునకు బర్మాభాషయందు "సదాడైక్" యని పేరు. పూర్వమున ముద్రణాసౌకర్యములు లేకపోవుటంబట్టి తాళీయదళ సంపుటములగు నానాయమూల్య గ్రంథజాలములు పండితులగృహములందును, రాజభవనములందును, "పొంగీ"లనబడుబౌద్ధభిక్షువుల మఠములందును, బౌద్ధాలయములలోను నా యపూర్వ పుస్తక సముదాయములకు పీఠములై యుండినటుల బర్మాదేశచరిత్రాంశములవలన తెలియుచున్నది. ఆకాలమున ముఖ్యముగా మతమునకు యావశ్యకములగు త్రిపీఠక బౌద్ధమత రహస్యగ్రంథములు ఆధ్యాత్మిక ధర్మములు, మానసిక మర్మతత్వములు, రాజనీతి అర్థనీతి శిల్పి వైద్య శాస్త్రీయగ్రంథములే యధికముగా యుండినటుల కనబడుచున్నవి. ఇంకను బడాకత్వాట్ యను సారస్వతమండలియందు బర్మాసన్యాసులు యనేక శాస్త్రవాదములు విపులముగా నక్కాలమున జరుపుచుండిరని పూర్వవిరచితములగు త్రిపీఠకవ్యాఖ్యాన భాష్యముల మూలమున విదితమగుచున్నది, దేశమున స్వాతంత్ర్య మస్తమించి రాజ్యము పర

హస్తగతంబైన పిదపనే నావిమర్శక గ్రంథములునహా కొంత క్షీణించి నవి. 1882 వ సంవత్సరమున కమిషనర్ గానుండిన చార్లెస్ బర్నార్డుదొరగారు (Charles Bernard) దేశీయులవిద్యాభివృద్ధికై పాఠశాల నొకదానిని నెలకొల్పి దానికి దగిన పరికరముల సేకరించు సమయమున అధ్యాపకులకు సహాయగ్రంథములతోను పరిశోధనకొఱకు కొన్ని గ్రంథసంపుటములతోను నొకయనుబంధ గ్రంథనికేతనము నెలకొల్పెను. కాలక్రమమున యాగ్రంథాలయము బర్నార్డు మహానీయుని నిరంతరకృషివలన విశేషాభివృద్ధిగాంచుటచే బర్నార్డు ధర్మగ్రంథనిలయ మను నామముచే ప్రసిద్ధికెక్కియున్నది. ప్రకృతము నియ్యది బర్మా రాజ్యాంగపువారి పోషణమున నున్నది. ఇదియే బర్మాదేశ మంతటికిని కేంద్రగ్రంథాలయము. భాండాగారమున రెండు మూడు వేల తాళపత్ర గ్రంథరాజములు గలవని గ్రంథపేటికల మూలమున తెలియుచున్నది. దొరతనమువారిచేతను విద్వాంసుల చేతను సేకరింపబడిన గ్రంథ సంపుటము లన్నియు ముద్రితములుగాక పోయినను కొన్నియైనను మరియే పుస్తకాగారమునందును లేనివి గలవని యా గ్రంథ భాండాగారి చెప్పెను. ఆ నికేతనమున నుండు సంపుటములను పండితులచే పరిశోధించి యపూర్వ పరిశీలనములు గ్రంథవివరములు విమర్శక వ్యాఖ్యానములు బర్మాపరిశోధకసంఘము వారి మూలమున ప్రకటితమగు మాసపత్రికయందు జర్చింపబడు చుండును.

ఇక్కాలమున దేశభాషామూలకవిద్య ప్రోత్సహింపబడు చుండినను గ్రంథముల జదివి రసమును గ్రహించువారి సంఖ్య యల్పమని చెప్పుటకు సంశయము లేదని బర్మా సన్యాసి వుద్దండాగారు యానతిచ్చిరి. ప్రాథమికవిద్య నిర్బంధముగను యుచితముగను ప్రసాదించుటకు బర్మా విద్యాశాఖవారివలన ప్రయత్నము లొనర్పబడుచున్నవి. ఇంకను రూపు గనలేదుగాని శుభసూచకములు మెండుగా గానవచ్చుచున్నవి. వర్తమానకాలమున విద్యావిషయము లందు బర్మీయులు కొంత వెనుకబడియున్నారనుట వాస్తవమైనను విద్యానిధులగు ఆధునిక యుపాధ్యాయులవలనను నవీన పద్ధతులయందు

సహేతుకపూర్వకములైన అభినవజ్ఞాన శాస్త్రీయ గ్రంథరచనలకు ప్రయత్నములు విరివిగా సాగించుచున్నారు. పాఠ్యగ్రంథ నిర్ణయ సంఘమువారుకూడ చేయూత నొసంగుచుండుటచేత కొలదికాలములో ప్రకృతివిషయ శాస్త్రీయగ్రంథములు యుద్భవిల్లినవి. అయితే అది చాలదు. ఇంకను నెక్కువ కృషి యొనర్పునటుల కనబడుచున్నది.

బర్మారాష్ట్రనిర్మాణ ఉద్యమమే బర్మీయులకు సకల ఆధునిక ఉద్యమములయందు పాల్గొనుటకు యుత్సాహ మొసంగుచున్నది. వారి సహజ అంధత్వమును వీడి యొక నూతన భావోద్రేకము వారి హృదయమున స్పందించుచున్నది. ఇప్పుడు యీ యుద్యమప్రచారమునకై "సన్" యను బర్మా దినపత్రిక బందులాయను వారపత్రిక తీవ్రప్రచారము సేయుచున్నవి. ప్రస్తుతము బహిరంగ యుపన్యాసములెల్లను బర్మాభాషయందే యివ్వబడుచున్నవి. భాషావిషయమున తగవులు లేవు. భారతీయులవలె మతమునందు కులములందు కక్షలులేవు. స్త్రీలకు సమాన స్వతంత్ర ధర్మములు వెలయుచుండుటచేత బర్మీయుల ప్రయత్నావళి యనతికాలమున సాఫల్యము నొందునని సూచించుటకు ప్రబలనిదర్శనములు గలవు.

—మా. సుబ్బరామయ్య.

---

# దక్షిణాంధ్ర క్షత్రియ గ్రంథాలయము.

## రాజపాళెయం.

రామనాథపురంజిల్లా రాజపాళెయమునసుండు ఆంధ్రులమగు మేము మాతృభాషాభివృద్ధిని బొందుటకై మాతృభాషాపోషకులగు సుదారవంతుల ద్రవ్యసహాయముచే ది 16-6-29 తేదిన గ్రంథాలయ మొందు స్థాపించితిమి. గ్రంథాలయస్థాపనదినమున ఆంధ్రగ్రంథములు 373, ద్రవిడగ్రంథములు 199, తరువాత ఏనుగవానిలంక హఠయోగాశ్రమ రాజయోగీంద్రులు పంపిన తెలుగు గ్రంథములు 60, సేలమునుంచి వీవింగు సూపరింటెండెంటు రామలింగస్వామిగారు పంపి

నవి 4 కలిసి మొత్తము 636 పుస్తకరాజములతో నలరారుచున్నది. గ్రంథాలయమునందలి గ్రంథములను స్త్రీలకును పురుషులకును ఉచితముగా నొసంగుబడుచున్నవి. ఆకారణమున స్త్రీ పురుషులకు ఆంధ్రభాష దినదినాభివృద్ధి గాంచుచున్నది. మేము మాతృభాషయగు నాంధ్రభాషను వృద్ధిచేసికొనుట కెంత కృషిచేయవలెనో అంతకృషి చేయగలుగుచున్న బీదవారలమైన తమిళనాడ్యాంతర్గత నివాసులమైన యాంధ్రులము. ఇంతకన్న స్వశక్తివలన వృద్ధినిపొందలేము గనుక భాషాపోషకులును, పత్రికాధిపతులును, కవిపుంగవులును మాకు సహాయభూతులగుటకు ప్రార్థించుచున్నారము.

—ఆంధ్రక్షత్రియగ్రంథాలయ కార్యదర్శి.

---

## ప్రకాశం గ్రంథాలయము-త్రివేండ్రం.

దక్షిణాదినున్న "ట్రివేండ్రము" నగరముననున్న హిందూస్థానీ సేవాదళముయొక్క వాలంటీరు లందరును కలసి ధర్మగ్రంథాలయమును స్థాపించిరి. ఈ గ్రంథాలయమునకు తోడుగా పఠనమందిరమునుగూడ జేర్చిరి. ఈ గ్రంథాలయమును పఠనమందిరమును దేశారాధనకొరకై ప్రత్యేకముగ పరిశ్రమజేయును. జాతీయభావమును ఉద్బోధింపజేయు గ్రంథములను ఇందు విశేషముగ జేర్చినారు.

---

## శ్రీలక్ష్మీనరసింహ ఆంధ్రగీర్వాణ పుస్తక భాండాగారము-ఉచితపఠనాలయము

కదిరి.

శ్రీ ఖాద్రిపురంబునందు 7 సం॥ లప్పుడు నెలకొల్పబడిన శ్రీలక్ష్మీనరసింహ ఆంధ్రగీర్వాణ పుస్తకభాండాగారము అనేక కారణాంతరములవలన నామమాత్రావశేషమై యుండినది. ఇటీవల ఈ

కొరతను బాపి, భాండాగారము పునరుద్ధరింపబడి క్రొత్తకార్యనిర్వాహకవర్గము యెన్నుకొనబడి, నిలయము యిప్పటికి నొక ప్రత్యేక భవనమునందు స్థాపింపబడియున్నది. ఇప్పుడు దాదాపుగా అయిదు వందలకు పైబడిన పుస్తకములు గలవు. అరువదిమంది సభ్యులు చేరియున్నారు. ఇంకను చేరుచున్నారు. సభ్యత్వరుసుము అందఱికి సనుకూలముగా నుండునట్లు నాలుగు అణాలుగ యేర్పాటు చేయబడియున్నది.

ఇందుకు తోడుగా నొక ఉచితపఠనాలయము నెలకొల్ప తీర్మానింపబడి, యద్దాని ప్రారంభోత్సవము జయప్రదముగా నాయుధపూజనాడు (12-10-29) జరుపబడెను. నిలయభవనము బహురమ్యముగా నలంకరింపబడియుండెను. ప్రముఖులు పలువురు విచ్చేసి గ్రంథాలయ పఠనాలయములను గూర్చియు, ప్రజల కర్తవ్యములను గురించియు విపులముగా ప్రసంగించిరి. కార్యదర్శిగారగు మ. రా. శ్రీ వి. వి. వేదాంతాచార్లుగారు, బి.యే.,బి.యల్. వందనము లర్పించుచు, పఠనాలయ ముఖ్యత్వమును గురించియు శ్రీమంతులతోడ్పాటావశ్యకతను గురించియు, ప్రజల ధర్మమును గురించియు నొక్కి వక్కాణించిరి. చందనతాంబూలాది వినియోగంపుతో సభ ముగిసినది.

---

## రామమోహన ధర్మగ్రంథాలయము, బెజవాడ

ఈ గ్రంథాలయమునకు బెజవాడ మునిసిపాలిటీవారు పది సంవత్సరముల పైనుండియు ప్రతి సంవత్సరమును రు 480 లు విరాళముగా నిచ్చుచుండిరి. అయితే ఈసంవత్సరము మొదట ద్రవ్యము లేని కారణముచే ఈ విరాళమును ఇచ్చుటకు నిరాకరించుచు తీర్మానించి, మరుసటి సభయందు తిరిగి యిచ్చుటకు తీర్మానించిరి. ఇచ్చుటకు తీర్మానింపబడిన ఈరెండవ తీర్మానమును కలెక్టరుగారు రద్దు జేయుచు, మునిసిపాలిటీవారికి మొదటి సభజేయు నప్పటికి లేని ద్రవ్యము రెండవ సభజేయునప్పటికి ఎక్కడనుండి వచ్చినదని సూచించిరి.

కలెక్టరుగారు 6-10-29 తేదీన బెజవాడ పట్టణమునకు రాగా వారిని గ్రంథాలయమునకు వచ్చి చూడవలసినదిగా గ్రంథాలయ ఉపాధ్యక్షులు మున్నగువారు కోరిరి. కలెక్టరుగారు గ్రంథాలయమునకు వచ్చిరి. పురప్రముఖులు వారిని గ్రంథాలయమువద్ద కలసికొని, గ్రంథాలయమునుగూర్చి తెలియజెప్పి మునిసిపల్ గ్రాంటును మంజూరు చేయవలసినదిగా కోరిరి కాని కలెక్టరుగారు తమ యుత్తరువును రద్దుచేయ జాలమనిరి. గ్రంథాలయమందిరమందు తరుచు రాజకీయసభలు జరుగుచున్నవనియు, అటుల జరుగుట గ్రంథాలయాభివృద్ధికి మంచిది గాదనియు జెప్పిరి.

ఈ గ్రంథాలయముయొక్క విరాళముతో బాటుగా బెజవాడ పట్టణమందుగల దుర్గాభ్రమరాంబా మల్లేశ్వర గ్రంథాలయముయొక్కయు, కార్మిక గ్రంథాలయము యొక్కయు, మహమ్మదీయ గ్రంథాలయము యొక్కయు ఆంధ్ర జమఖానాయొక్కయు విరాళములు గూడ రద్దుజేయబడినవి.

ఆంధ్రపత్రిక వ్రాసిన సంపాదకీయవ్యాసము ఈక్రింద ముద్రింప బడినది:—

బెజవాడలోని రామమోహనలైబ్రరీవారు సలుపుచున్న కృషి నాంధ్రదేశమేగాక, యితర రాష్ట్రములు గూడ శ్లాఘించియున్నవి. గ్రంథాలయోద్యమమునకు వీరే ప్రధానమార్గదర్శకులయిరి. వీరికి బెజవాడ మునిసిపాలిటీవారు సాంవత్సరికపు గ్రాంటు నిచ్చుచుండెడివారు. ఈ సంవత్సరముగూడ నీయ నిశ్చయించిరి. కాని కలెక్టరుగారు వలదని ఉత్తరు విచ్చినటుల తెలియుచున్నది. కలెక్టరుగారు లైబ్రరీని స్వయముగా తిలకించియు, తమ యభిప్రాయమును మార్చుకొనరయిరి. ప్రధాన గ్రంథాలయమునకు గలిగిన యవమానము గాంచియైనను, ఇతరగ్రంథాలయములు ప్రభుత్వపు గ్రాంటులనంగీకరింపక, స్వశక్తిపై నాధారపడుట మేలగును. గ్రాంటుల నిమిత్తము గ్రంథాలయములు తమస్వేచ్ఛను ఉపయోగమును కోల్పోవజాలవు. స్థానిక స్వపరిపాలన సంఘముల నిస్సహాయత యిందు

RSVM01A 144



మూలమున మరింత వ్యక్తమగుచున్నది. రాజకీయ స్వేచ్ఛకేయది యేయుద్యమమయినను, ఎటుల యభివృద్ధి జెందజాలదో, రామమోహన లైబ్రిరీకి గలిగిన యవమానము తెలుపకనే తెలుపుచున్నది. బెజవాడ ప్రజ లీసమయమున రామమోహన గ్రంథాలయముపై నభిమానము వహించి, గ్రాంటులేని లోపమును పూర్తిజేసి, గాఢాభిమానము జూపి ద్రవ్యసహాయము సలిపెదరని నమ్మెదము. రామమోహన గ్రంథాలయము సత్వరాభివృద్ధిగాంచి, జ్ఞానవ్యాప్తి కధికమగుసేవ జేయుగాక యని కోరెదము.

---

## నివేదికలు

"ఏలూరు" గో సంరక్షణ సమితియొక్క మూడవ నివేదిక అందినది. ఇది స్థాపింపబడిన 11 సంవత్సరముల నుండియు దినదినాభివృద్ధి గాంచుచున్నది. ఇంతవరకు దీనికి రు 18,324-4-2 లు శాశ్వత నిధి గలదు. 1-10-27 మొదలు 31-12-1928 వరకు దీనికి ఆదాయము రు 4,013-9-8 లు; వ్యయము రు 2,476-1-3.

"వేటపాలెము" నందున్న సారస్వత నికేతనముయొక్క ఏకాదశ వార్షిక చరిత్ర అందినది. (5-10-28 మొదలు 30-9-29 వరకు) ఈ గ్రంథాలయమునకు రు 7,840 లు మూలధనము గలదు. మొత్తము రు 17,086-13-6 విలువగల ఆస్తి గలదు. ఈ కాలమునందు ఆదాయము రు 2,172-8-5 లు; అంతయు వ్యయపడినది. ఇందులో ధర్మకర్తగారగు ఊటుకూరి వెంకటసుబ్బారాయ శ్రేష్ఠిగారి పెట్టుబడి రు 1,387-15-5 లుండుట గుర్తింపదగినది. వేటపాలెం యూనియన్ బోర్డువారు రు 50 ల నిచ్చిరి. ఈ కాలమునందు పురుషులచే చదువబడిన గ్రంథముల సంఖ్య 3,233; స్త్రీలచే చదువబడిన గ్రంథముల సంఖ్య 202.

---

మనసు ఫౌండేషన్

పుస్తకాల పరిశీలనాపట్టిక

| | |
|---|---|
| పుస్తకం సంఖ్య | RSVM01 A 144 |
| పుస్తకం పేరు | [illegible] |
| తారీఖు | 7/6/24 |
| ముందు అట్ట | Yes |
| వెనుక అట్ట | Yes |
| మొత్తం పేజీలు | 21 |
| పెద్ద సైజు పేజీలు | NO |
| ఖాళీ పేజీలు | C I,17 |
| లేని పేజీలు | NO |
| తయారు చేసినది | Sandhya |
| పేజీలు విడదీసినది | Sandhya |
| స్కాన్ చేసినది | Sandhya |
| పరీక్ష చేసినది | Pragathi |
| పేజీలు సరిచూసినది | |
| బైండింగు చేసినది | |
| ప్యాకింగు చేసినది | |
| స్కాన్ చెయ్యనివి | |
| తప్పులు | No |
| పరిస్థితి | Good |